క్లుప్తంగా

ఉత్సవాలు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ శివారులోని పోలమాంబదేవి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఉదయం వేద పండితుల సమక్షంలో విఘ్నేశ్వర పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించగా, ఆ తర్వాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అఖండ దీపారాధన అష్టోత్తర పూజలు చేశారు. అలాగే భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మొదలైన రామయ్య పెళ్లి పనులు

చర్ల: మండల కేంద్రంలోని పాతచర్లలో ఉన్న సీతారామ భక్తాంజనేయస్వామి వారి దేవాలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారామచంద్రస్వామి వారి కల్యాణ పనులు ప్రారంభమయ్యాయి. పనుల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల నేతృత్వంలో పందిరి ముహూర్తాన్ని వేసి పసుపు కొట్టే పనులు నిర్వహించారు. ఈ నెల 29న సాయంత్రం 7 గంటలకు ఎదుర్కోలు, 30న మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీరామ నవమి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కమిటీ కోరింది.

సమస్యలపై ఆందోళన

చర్ల: మండలంలోని తేగడ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రెయినేజీలలో పూడిక తీయాలని డిమాండ్ చేశారు. వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలలో ఇళ్ల ముంపునకు గురైన బాధితులందరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామం ప్రధాన రహదారిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను మండల బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం దహనం చేశారు. ఎమ్మెల్సీ తెలంగాణ ఉద్యమకారి, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, సోడి తిరుపతిరావు, సర్పంచ్‌లు మట్టా వెంకటేశ్వర రావు, సోడి జ్యోతి, బిఆర్ఎస్ నాయకులు కణితి రాముడు, జానీపాషా, కణితి లక్ష్మణ్, కెల్లా శేఖర్, మోత్కురి శ్రీకాంత్, జిలకర గంగరాజు, జంగిటి రాము, కొప్పుల సాగర్, పరికపల్లి వెంకటేశ్వర రావు, పాయం వెంకటేశ్వరరావు, నాగరాజు, రఘు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

చర్ల: హైదరాబాద్‌కు చెందిన రమాకాంత్-అనురాధ దంపతుల సహకారంతో ఆదివారం చర్లలో ఆదివాసీలకు దుస్తులు పంపిణీ చేశారు. చర్లలోని మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో చర్లలోని గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంతకు వచ్చిన వారిలో సుమారు 200 మందికి సుమారు రూ.50 వేల విలువ చేసే దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రమాకంత్-అనురాధ దంపతులు మాట్లాడుతూ.. ఆదివాసీలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరిన్ని చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. కార్యక్రమంలో మేమున్నాం సహాయక కమిటీ చైర్మన్ నీలిప్రకాశ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

అశ్వారావుపేటరూరల్: సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చిత్రపటాలకు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని పేటమాలపల్లి వద్ద దళిత బంధు పథకం కింద మరింత మంది లబ్ధిదారులకు మేలు చేసేలా ప్రకటించడం పట్ల స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేసి, నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు యూఎస్ ప్రకాశ్‌రావు, అల్లాడి వెంకటరామారావు, మోహన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మణుగూరురూరల్: ప్రతి ఒక్క వాహన దారుడు, డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని మణుగూరు సీఐ ముత్యం రమేష్ సూచించారు. మణుగూరులోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఐ రమేష్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలను నిలిపి సంబంధిత ధృవపత్రాలను పరిశీలించారు. పలువురు వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ.. వాహన ధృవపత్రాలు లేకుండా, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూలన పడిన 'పారిశుద్ధ్యం'

- చెత్త సేకరణ వాహనాలకు డ్రైవర్ల కొరత
- కార్యాలయానికే పరిమితమైన వైనం..
- దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయినేజీలు



సుందరయ్యనగర్‌లో మురుగు నీటితో డ్రెయినేజీ



మున్సిపాలిటీకే పరిమితమైన చెత్త సేకరణ వాహనాలు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మూలన పడింది. ప్రజలనుంచి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు.. ప్రజలకు కావాలసిన సౌకర్యాలు కల్పించడంలో పట్టించుకోవడంలేని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో తప్ప మున్సిపాలిటీలోని అంతర్గత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం విషయంలో పట్టించుకోవడం లేదు. గత రెండు నెలలుగా వీధుల్లో చెత్త సేకరించాల్సిన వాహనాలుసైతం రావడంలేదని సుందరయ్యనగర్ ప్రాంత వాసులు వాపోతున్నారు. ప్రభుత్వం మణుగూరు మున్సిపాలిటీని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని కోట్ల నిధులు కేటాయిస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా తయారైంది. స్వచ్ఛ భారత్ పేరుతో మున్సిపాలిటీకి చెత్త సేకరణ వాహనాలు కేటాయించినప్పటికీ అవి నడపడానికి డ్రైవర్లు లేకపోవడంతో ఆ వాహనాలు కార్యాలయానికే పరిమితమయ్యాయి. వాహన డ్రైవర్లకు సకాలంలో వేతనాలు ఇవ్వక పోవడంతో ఎవరూ పనిచేయడానికి ముందుకు రావడంలేదు. దీంతో ప్రజలు పారిశుద్ధ్యానికి మరింత దూరంగా ఉన్నారు.

నిండిపోయిన డ్రెయినేజీలు..

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్యం పట్టించుకోకపోవడంతో అంతర్గత డ్రెయినేజీలు పూర్తిగా నిండిపోతున్నాయి. మురికి నీరుతో నిలువ ఉన్న డ్రెయినేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్త సేరకణ సైతం సక్రమంగా జరగడంలేదు. పన్నులు మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్న అధికారులు ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కోట్లు ఖర్చుచేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ప్రజలకు కనీస సౌకర్యాలు అందించింది లేదు.

చెత్త సేకరణ లేదు..



మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో చెత్త సేకరణ చేయడం లేదు. వీధిలైట్లు సరిగా వెలగడంలేదు. వేసిన లైట్లు వెలగకపోతే ఎవరు పట్టించుకోవడంలేదు. చెత్త వాహనాలు రాక సుమారు నెల రోజులు దాటింది. పన్నులు మాత్రం తప్పకుండా వసూలు చేస్తున్నారు.

– ఎం.సురేష్, సుందరయ్యనగర్

కాలువలు శుభ్రం చేయడం లేదు



మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో కాలువలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు సైతం చెత్త పన్ను వేస్తున్నారు. చెత్త పన్ను కట్టినా వాహనాలు సక్రమంగా రావడంలేదు. అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– జి.నీరజ, సుందరయ్యనగర్

డ్రైవర్ల కొరత ఉంది..



చెత్త సేకరణ వాహనాలకు డ్రైవర్ల కొరత ఉంది. ప్రజలు చెత్త సేకరించే వాహనాలకు ఇంటికి రూ.50 చొప్పున చెల్లించాలని చెప్పినప్పటికీ ఎవరూ సక్రమంగా చెల్లించకపోవడంతో డ్రైవర్స్‌కు సంబంధిత కాంట్రాక్టర్లు వేతనాలు చెల్లించకపోతున్నారు. సాధ్యమైనంత త్వరగా డ్రైవర్స్‌ను ఏర్పాటు చేస్తాం.

– మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్

సింగరేణిని పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు త్యాగరాజన్

మణుగూరురూరల్: సింగరేణి సంస్థను పరిరక్షించుకునేందుకు కార్మికులందరూ ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలని ఐఎన్‌టీయూసీ నేత సి.త్యాగరాజన్ పిలుపునిచ్చారు. ఆదివారం పీవీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. సింగరేణి సంస్థను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు ఐఎన్‌టీయూసీ నిర్వహించే పోరాటాల్లో కార్మికులందరూ భాగస్వాముల కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, సింగరేణి సంస్థ పరిరక్షణకై కార్మికవర్గం రాబోయే గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే త్వరలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థలో చేపట్టబోయే హాత్ సే హాత్ జోడో యాత్రలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ముక్తేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ, టి.శ్రీనివాస్, పి.నారాయణ, సతీష్, సురేష్, భద్రం తదితరులు పాల్గొన్నారు.

14న విద్యుత్ వినియోగదారుల సదస్సు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో రైతు వేదిక ఆవరణలో ఈ నెల 14న విద్యుత్ వినియోగదారుల సదస్సును ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.యోహాను ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ పి.సత్యనారాయణ హాజరవుతారని, ఈ సదస్సులో వినియోగదారుల ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపబడతాయని ఆయన తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లో ఓల్టేజ్, హై ఓల్టేజీల నియంత్రణ, లోపాలు ఉన్న విద్యుత్ మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరు అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, సర్వీసుల రద్దు తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలపై లిఖితపూర్వకంగా దరఖాస్తులు తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. 14న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఈ సదస్సు కొనసాగుతుందని వెల్లడించారు.

సమాజహితానికి పాటుపడాలి



భద్రాచలంటౌన్: పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



మణుగూరురూరల్: మణుగూరులో ర్యాలీ..

భద్రాచలంటౌన్: యువత సమాజహితం కోసం సంసిద్ధులై ఉండాలని రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (ఆర్ఎస్ఎస్) డీఎల్పీఓ పవన్ కుమార్ అన్నారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం పట్టణంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంఘం స్వయం సేవకులు ఘోష్ బ్యాండ్‌తో పురవీధులలో భారీ కవాతు నిర్వహించారు. పురవీధులలో కవాతులో పాల్గొని కళాశాల మైదానంలో జరిగిన ముగింపు ఉత్సవంలో పవన్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఓ సిద్ధాంతంతో నిబద్ధత కలిగిన దేశభక్తి, క్రమ శిక్షణ కలిగిన యువతను తయారు చేస్తోందన్నారు. కరోనా కారణంగా సంఘ కార్యక్రమాలు కొంత స్తబ్దత ఏర్పడిందని, ఇప్పుడు శాఖ కార్యక్రమాల ద్వారా సంఘం తన విస్తరణను చురుకుగా ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఒక విశేష కార్యక్రమం నిర్వహించే ప్రణాళికలో భాగంగా ఉగాది పర్వదిన మాసంలో ఈ పథ సంచలన ర్యాలీ సమీకరణతో కార్యకర్తలకు చైతన్యాన్ని, సమాజానికి సంఘం సిద్ధాంతాన్ని చూపినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా కార్యవాహ మేదరమెట్ల పార్థసారథి, 120 మంది కార్యకర్తలు, 50 మంది అభిమానులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం పథ సంచలన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పూల మార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ సెంటర్ మీదుగా కొనసాగింది. ర్యాలీలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 2025నాటికి వంద సంవత్సరాలు పూర్తి కావొస్తున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్‌ను విస్తరించేందుకు ప్రణాళికలకు రూపొందించడం జరిగిందని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉజ్జీవ మహాసభలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీలో నేటి నుంచి 20 వార్షిక విమోచన ఉజ్జీవ మహాసభలు నిర్వహించనున్నట్లు విమోచన ప్రేయర్ మినిస్ట్రీస్ రెవరెండ్ డి.ప్రకాశరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభలకు వాక్యోపదేశకులుగా చేబ్రోలులోని కరుణాపీఠం విమోచన పెంతెకొస్తు నుంచి డాక్టర్ రాంకిషన్ ఫెన్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి రోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సభలు జరుగుతాయని తెలిపారు. సంగీత పాటలతో స్తుతి ఆరాధనలు, రోగుల ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు జరుగుతాయని వెల్లడించారు.

నిత్యావసరాలు అందజేత

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన నక్కా పాపయ్య, వెంకటమ్మ అనే వృద్ధులకు వీ ఫర్ యు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వీ ఫర్ యూ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వైభవం..

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీలోని శివలింగాపురం సమీపంలో ఉన్న గుట్టపై శివాలయంలో కొన్నేళ్లుగా ధూపదీప నైవేద్యాలు నిలిచిపోయాయి. ఆ ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శ్రీనృసింహ సేవా వాహిని ముందుకొచ్చింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు శివాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి ప్రతి రోజూ ఇక్కడి శివాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు కొనసాగుతాయని ఇందుకు భక్తులు సహాయ సహకారాలను అందించాలని సేవా వాహిని సభ్యులు కోరారు.

మెటీరియల్ అందజేత

చర్ల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి పూర్వ విద్యార్థులు స్టడీ మెటీరియల్ అందజేశారు. చర్లకు చెందిన 1994–95 విద్యాసంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4లకు చెందిన స్టడీ మెటీరియల్‌తో పాటు గ్రంథాలయానికి అవసరమైన కుర్చీలు, రీడింగ్ ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, పూర్వ విద్యార్థులు మాన్యం రంజిత్‌కుమార్ (యూఎస్ఏ), ఎస్‌కె అబ్దుల్లా, మద్దూరి నాగరాజు, మామిడి తిరుమలరావు, గ్రంథపాలకులు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'ని వర్తింపజేయాలి

బూర్గంపాడు: అర్హులందరికీ గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వం నియోజకవర్గానికి కేవలం రూ.3వేల ఇళ్లు కేటాయించటం సరికాదని తెలిపారు. ఎనిమిదేళ్లుగా పేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా ఇప్పుడు నియోజకవర్గానికి కేవలం మూడు వేల ఇళ్లు ఇస్తామనటం పేదలకు అన్యాయం చేయటమేనని పేర్కొన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు.

స్వచ్ఛోత్సవ్‌కు దరఖాస్తు చేసుకోండి



మురళీకృష్ణ
మున్సిపల్ కమిషనర్

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నిర్వహించనున్న స్వచ్ఛోత్సవ్-2023 కార్యక్రమాలకు పట్టణ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆదివారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛోత్సవ్-2023లో భాగంగా మణుగూరులోని అన్ని రంగాల మహిళలకు పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్ నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ సేవలు, మున్సిపల్ వేస్ట్ సేకరణ మరియు రవాణా వేస్ట్ టు వెల్త్ ఉత్పత్తులు, సాలిడ్ వేస్ట్ నిర్వహణ, ఐఈసీ, ట్రెనింగ్, సాంకేతిక, ఆవిష్కరణ, మహిళా ఎంటర్ పెనియర్, స్టార్టప్, ఎస్‌హెచ్‌జి గ్రూప్‌లు, ఎన్‌జీఓలు వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఐదుగురు మహిళలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నామన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 15వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పూర్తి వివరాలతో కూడిన దఖాస్తులను అందజేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

బీఎస్పీతోనే సామాజిక న్యాయం



మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర అన్నారు. మండల పరిధిలోని పేరాయిగూడెం, మోడల్ కాలనీలో ఆదివారం ఇంటింటికీ పార్టీ ఎన్నికల గుర్తు, విధానాల గురించి కరపత్రాలు అందించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో హామీలను విస్మరించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పాలని, బీఎస్పీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంగం దుర్గారావు, జక్కుల చిన్ని, గొల్లమండల పెంటయ్య, పోలయ్య, వినోద్, చక్రపాణి, సురేష్, సుహాసిని, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలోని గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన పున్నం పుష్ప కుటుంబానికి సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే పున్నం పుష్ప భర్త, కుమారుడు మరణించారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న ఇద్దరు మరణించడంతో పుష్ప దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడుతోంది. సీపీఐ నిర్వహించిన ప్రజా పోరుయాత్రలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య పుష్ప పరిస్థితిని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. రాష్ట్ర నేత అయోధ్య ఆదేశాల మేరకు మండల పార్టీ నాయకులు బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సోందె కుటుంబరావు, రాయల బిక్షం, డి.బాబు, బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో అన్నదానం



వారపు సంతకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ వాసులకు అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు వచ్చిన ఆదివాసీలకు మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. చర్లకు చెందిన సుబ్రహ్మణ్యం-హిమజ దంపతుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ అన్నదానంలో వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 350 మంది ఆదివాసీలు పాల్గొని భుజించారు. ఈ సందర్భంగా మేమున్నాం సహాయక మిటీ చైర్మన్ నీలి ప్రకాశ్ మాట్లాడుతూ.. పొరుగురాష్ట్రం నుంచి వస్తున్నా ఆదివాసీలకు దాతల సహకారంతో అన్నదానం చేయడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రతీ వారం కొనసాగించేందుకు దాతలు మరింతగా ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పరిటాల రమణ, మర్ల ప్రసాద్, దత్తు, ఎంవీఎస్ఎన్‌చారి, దొడ్డా ప్రభుదాసు, దొడ్డి సూరిబాబు, దొడ్డి రమణారావు, గొట్టిపాటి శ్రీనిఆసరావు, ఇర్పా తిరుపతిరావు, సొల్లంగి నాగేశ్వరావు అలవాల మురళీ, తిరువాయిపాటి రాజేష్ మర్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అశ్వారావుపేటకు చెందిన జీవనశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వైద్యులు పూర్ణచంద్, భవ్యసుధ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సర్పంచ్ కంగాల పరమేష్, గ్రామస్తులు ఆకుల శ్రీను, చందా కుమారస్వామి, ఆస్పత్రి సిబ్బంది కిషోర్, సురేష్, శ్రీవాణి, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.

'హలో శుభోదయం'

ములకలపల్లి: 'హలో శుభోదయం'పేరిట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు జారె ఆదినారాయణ ఆదివారం ములకలపల్లిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బస్టాండ్‌సెంటర్‌లోని మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం గ్రామంలో పాదయాత్ర చేపట్టి, పలువురిని పలుకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పురవీధుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానిక సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజి, మేకల రాజేశ్, శనగపాటి రవి, మేకల పెద్ద వెంకన్న, బిక్కుమళ్ళ సుధాకర్, నకిరకంటి కొండల్‌రావు, దుగ్గి సంపత్, మిరియా అవినాష్, కొక్కెరగడ్డ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి సర్జికల్ బెడ్ వితరణ



బెడ్ అందజేస్తున్న స్వరాజ్యరావు, పిచ్చేశ్వరరావు

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన వ్యాపారి బచ్చు వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన జ్ఞాపకార్థం ఆయన సోదరుడు బచ్చు స్వరాజ్యరావు అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆదివారం సర్జికల్ బెడ్‌ను వితరణగా అందజేశారు. దానిని వైద్యాధికారి డాక్టర్ సంకీర్తనకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, పి.ధనుంజయ్, ఆర్.సత్యనారాయణ, జీఎస్.రావు, సందీప్, లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓ కాంతమ్మ పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రహరీ నిర్మించండి!



మండల పరిధిలోని మామిళ్లవారిగూడెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. భవనానికి రక్షణ గోడ లేకపోవడంతో మూగజీవాలు సంచరిస్తున్నాయని, దాంతో పరిసరాలు అధ్వానంగా ఉంటున్నాయని వాపోతున్నారు. కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో మద్యం బాబులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కేంద్రానికి చుట్టూ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: ప్రసాద్, ఏఈ, ఐటీడీఏ, అశ్వారావుపేట
ఫోన్ నంబర్: 94402 03270